09102024-DIS-08_Layout 1 10/9/2024 3:12 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

నెత్తురోడిన బస్తర్

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతం మరోసారి మావోయిస్టు, పోలీసు బలగాల రణరంగమైంది. దంతెవాడ, నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది నక్సల్స్ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 13 మంది మహిళా నక్సలైట్లు ఉన్నారు. భారీ మొత్తంలో రివార్డులున్న పలువురు సీనియర్లను మావోయిస్టు పార్టీ కోల్పోయింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటైన 24 సంవత్సరాల కాలంలో ఇదే అతిపెద్ద ఎన్‌కౌంటర్. వరుస నష్టాలతో కునారిల్లుతున్న మావోయిస్టులకు తాజా ఎన్‌కౌంటర్ పెద్ద దెబ్బే అని చెప్పాలి. ఐదు మాసాల క్రితం కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మరణించారు. బస్తర్ ప్రాంతంలో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 188 మంది నక్సల్స్ హతులయ్యారు. మొత్తంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎదురుకాల్పుల మృతుల సంఖ్య 237కు చేరుకుంది. శుక్రవారం నాటి ఎదురు కాల్పుల్లో పోలీసులకు ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. మారుమూల అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు పూర్తి సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించడం వల్లే ఇది సాధ్యమైందన్న ప్రశంసలు వినిపిస్తున్నాయి. కానీ, హింస ఎటుమైపు నుంచి జరిగినా ప్రాణ నష్టం తప్ప సాధించేదేమీ ఉండదు.

సుమారు ఆరు దశాబ్దాల కిందట సమ సమాజం, తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం అనే భావనలతో మొదలైన నక్సలైట్ ఉద్యమం కాలక్రమంలో అనేక చీలికలకు గురైంది. ప్రస్తుతం నక్సల్ ఉద్యమం కొన్ని ప్రాంతాలకే, ముఖ్యంగా గిరిజనులు అధిక సంఖ్యలో ఉండే అటవీ ప్రాంతాలకే పరిమితమైంది. గిరిజనులకు వారసత్వంగా సంక్రమించిన అటవీ సంపదను కార్పొరేటీశక్తుల బారి నుంచి కాపాడే ప్రయత్నాలకు నక్సలైట్లు మొదటినుంచీ అండగా నిలుస్తున్నారు. అయితే అందుకు వారు సాయుధ మార్గాన్ని ఎంచుకోవడం సమస్య అయింది. నక్సల్ ఉద్యమాన్ని కేవలం శాంతిభద్రతల సమస్యగా చూసే ప్రభుత్వం పోలీసు బలంతో అణచడం వైపే ఎక్కువగా మొగ్గు చూపడం తెలిసిందే. అందునా కమ్యూనికేషన్స్, నిఘా సాంకేతికత ఎంతగానో విస్తరించిన ప్రస్తుత కాలంలో పోలీసు వ్యవస్థకు ఉండే అధికృతను తక్కువగా అంచనా వేయలేం. ప్రపంచవ్యాప్తంగా సాయుధ పోరాటాలు విపలమయ్యాయనేది ఎంత సత్యమో, కేవలం ఆయుధ బలంతో ఉద్యమాలను అణచివేయలేమనేదీ అంతే సత్యం.

ఈ నేపథ్యంలో జరిగిన బస్తర్ ఎన్‌కౌంటర్ అటు ప్రభుత్వ వ్యవస్థ, ఇటు మావోయిస్టులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అగత్యాన్ని నొక్కి చెప్తున్నది. పోలీసుల్లోనూ, నక్సల్స్‌లోనూ అధికంగా బలయ్యేది అట్టడుగు, నిరుపేద వర్గాల యువతే. ఈ దేశ సంపదలో భాగమైన యువత ఇలా హింసాత్మక ఘటనలకు బలైపోవడం బాధాకరమైన విషయం. నక్సల్స్‌కు నెలవులుగా మిగిలిపోయిన గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తే సమస్యకు పరిష్కారం కనుగొనడం సాధ్యమే. అదేవిధంగా నక్సల్స్ కూడా కాలం చెల్లిపోయిన సాయుధ పోరాట వ్యూహాలను వదిలిపెట్టి జనజీవన స్రవంతిలోకి రావాల్సిన అవసరమూ ఉన్నది. ఇప్పటివరకు జరిగిన నష్టం చాలు. ఇకనైనా ఇరుపక్షాలూ పట్టు విడుపులు ప్రదర్శించి ఏకాభిప్రాయానికి వస్తే దేశానికి అంతకన్నా కావాల్సింది ఏముంటుంది.

తిరోగమన దిశలో తెలంగాణ వికాసం

ఏనుగుల రాకేశ్ రెడ్డి

ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా పాలన సాగాలి. అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలి. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలకులు పని చేయాలి. కానీ, రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏడాది తిరక్కముందే తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో దేశంలోనే నంబర్ వన్‌గా ఎదిగిన తెలంగాణ తిరోగమనంలో పయనిస్తున్నది. రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ పేరిట జరుగుతున్న విధ్వంసమే అందుకు నిదర్శనం.

స్వరాష్ట్రం ఏర్పడే నాటికి మన తెలంగాణ అనేక సమస్యలకు నిలయం. తెలంగాణలోని పది జిల్లాల్లో హైదరాబాద్ మినహా మిగతా 9 జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరచడమే అందుకు ఉదాహరణ. అలాంటి రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన అనతికాలంలోనే దేశంలోనే నెంబర్ 1గా ఎదిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్నో అవార్డులు గెలుచుకొని ఆదర్శంగా నిలిచింది. కేసీఆర్ సర్కార్ దార్శనికత, విధానాలు, దూరదృష్టి, విజనరీ నాయకత్వం, అద్భుతమైన పాలనా పటిమ అందుకు ప్రధాన కారణం. పదేండ్లలోనే తెలంగాణ, హైదరాబాద్ అంటే ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ ఏర్పడింది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో పర్యటిస్తే 'అసలు మనం హైదరాబాద్‌లోనే ఉన్నామా?' అన్న సందేహం కలిగేలా అభివృద్ధి జరిగింది.

పునర్నిర్మాణం దిశగా తెలంగాణ వేగంగా అడుగులు వేస్తున్న సమయంలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మార్పు అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా, మూసీ సుందరీకరణ వంటి అగమ్యగోచరమైన విధానాలతో హైదరాబాద్ బ్రాండ్‌ను దెబ్బతీస్తున్నది. పెట్టుబడులకు స్వర్గధామమైన తెలంగాణ ఇప్పుడు విధ్వంసం దిశగా సాగుతున్నది. కూల్చివేతల కారణంగా రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలైంది.

ఈ కూల్చివేతల విషయంలో ప్రభుత్వం, స్వయంగా ముఖ్యమంత్రే సామాన్య ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను, హైడ్రా బాధితులను ఆక్రమణదారులుగా, సంఘ విద్రోహ శక్తులుగా, కబ్జాదారులుగా చిత్రీకరిస్తున్నారు. ఇది అత్యంత పైశాచికం. ఇల్లు వాకిలితో పాటు జీవనోపాధిని కోల్పోయిన వారంతా చేయని తప్పుకు నిందలు మోస్తూ, సామాజిక వెలివేతకు గురవుతూ మానసిక వేదనను అనుభవిస్తున్నారు.

చాలామందిలో ఒక అపోహ ఉంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంటే ఆక్రమిత భూములని అనుకుంటున్నారు. కానీ, అవన్నీ పట్టా భూములే. ప్రభుత్వమే వారికి పట్టాలు ఇచ్చింది. ప్రతి ఇంటి స్థలం సుమారు 20, 30 సార్లు రిజిస్ట్రేషన్ అయింది. ప్రభుత్వం అందుకు పన్నులు కూడా స్వీకరించింది. అందులో గృహ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో పాటు విద్యుత్తు, నీళ్ల కనెక్షన్, రోడ్లు, నాలాలు నిర్మాణాలు చేసి అభివృద్ధి చేసింది. ఇప్పుడు ఉన్నపళంగా అవన్నీ అక్రమమని అంటే ఎలా? వారంతా ఎక్కడికి వెళ్లాలి? పన్నులు కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములు అక్రమమేలా అవుతాయి?

ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలెన్నుకున్న ప్రభుత్వం ప్రజా సంక్షేమార్థమే పని చేయాలి. ఏ ప్రభుత్వానికైనా ప్రజలు సుఖసంతోషాలతో జీవించడమే తొలి ప్రాధాన్యం కావాలి. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ చేసే విధ్వంసం అభివృద్ధి ఎలా అవుతుంది? ఒక ప్రభుత్వం అనుమతి ఇస్తే మరో ప్రభుత్వం ఎలా కూలగొడుతుంది? ఒక ఐఏఎస్ అధికారి అనుమతులు ఇస్తే మరో ఐపీఎస్ అధికారి కూలగొట్టడమేంటి? ఇలాంటి అనాలోచిత నిర్ణయాలతో సమాజం

పురోగతి సాధిస్తుందా? విధ్వంసం జరిగేచోట వికాసం సాధ్యమవుతుందా? ఈ నేపథ్యంలో నిర్మాణం చేయడం అభివృద్ధా? లేదా కూల్చడం అభివృద్ధా? అన్నది మేధావులు, ప్రజలు ఆలోచించాలి. కూల్చివేతలు పెట్టుబడులను ఆకర్షిస్తాయా? నిలబెడితే పెట్టుబడులు వస్తాయా? అన్నది ప్రభుత్వం, పాలకులు గుర్తించాలి.

చెరువులను, కుంటలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమైతే ముందుగా ఒక కమిటీ వేయాలి. ఏ నిర్మాణాలు అక్రమమో, ఏవి సక్రమ నిర్మాణాలో గుర్తించాలి. ప్రజాభిప్రాయ సేకరణ జరిపించాలి. పట్టా ఇళ్లకు మార్కెట్ ధర నిర్ణయించి నష్ట పరిహారం చెల్లించాలి. ఇలా ఒక విధానం ప్రకారం ముందుకు సాగాలి. అది అసలైన ప్రజా పాలన. హైడ్రా పేరిట చెరువులు, కుంటలు రక్షిస్తామని చెప్పి ఆ చెరువులను పేదల కన్నీళ్లతో నింపడం ప్రజాపాలన అవుతుందా?

హైడ్రాకు అందరూ సమానమే అంటున్న ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క నాగార్జున ఎన్ కన్వెన్షన్ మినహా ఒక్క బడా నాయకుడి ఫామ్ హౌస్ మీదికి కూడా బుల్డోజర్ పంపలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కేపీవీ రామచంద్రరావుల ఫామ్‌హౌస్‌లు పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నప్పటికీ వాటిని కూల్చలేదు. అందుకు విరుద్ధంగా పైసా పైసా పోగుచేసి కట్టుకున్న నిరుపేదల ఇళ్లను మాత్రం నేలమట్టం చేస్తున్నారు.

> **నదులే నాగరికత నిర్మాతలు. నదుల వెంబడే నాగరికత పరిఢవిల్లుతుంది. అందుకే మూసీ పక్కనే నగరం నిర్మాణమైంది. అలా కాలక్రమంలో వేల కుటుంబాలు మూసీ తీరం వెంబడి ఇళ్లు నిర్మించుకున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వల్ల ఇప్పుడు వారంతా రోడ్డున పడుతున్నారు. ప్రాజెక్ట్ అంటే తాగునీరో, సాగునీరో అందించేది కాదు. నది సుందరీకరణ మాత్రమే.**

కాళేశ్వరం, నాగార్జున సాగర్, శ్రీశైలం, దేవాదుల, సీతారామ లాంటి ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేస్తే జరిగే నష్టమేమీ లేదు. జాతి ప్రయోజనాల కోసం జరిగే బృహత్తర కార్యంలో భాగస్వాములు అవుతున్నదందుకు నిర్వాసితులు సంతోషిస్తారు. కానీ, మూసీ సుందరీకరణ అలాంటి కాదు. బడా బాబుల కోసం జరిగే సుందరీకరణ కోసం పేదల బతుకులను ఛిద్రం చేయడమేమిటి?

అసలు ఇప్పటివరకు మూసీ ప్రాజెక్టుకు సంబంధించి స్పష్టమైన డీపీఆర్ లేదు. ఒక్కో మంత్రి ఒక్కో విధంగా అంచనాలు లెక్క గడుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు రూ.50 వేల కోట్లని చెబితే.. ముఖ్యమంత్రి ఏకంగా రూ.1.50 లక్షల కోట్ల అంచనా వ్యయం అవుతుందని చెబుతుండటం కాంగ్రెస్ పాలకుల తీరుకు నిదర్శనం.

నమామి గంగా ప్రాజెక్ట్‌కు కిలోమీటర్‌కు రూ.17 కోట్లు ఖర్చు అవుతుండగా.. మూసీ సుందరీకరణకు మాత్రం కిలోమీటర్‌కు రూ.2,727 కోట్లు ఖర్చు అవుతున్నట్లు ప్రాథమిక అంచనా. అంటే నమామి గంగాతో పోలిస్తే ఇది 160 రెట్లు ఎక్కువ. ప్రాజెక్టు మొదలయ్యాక ఇది మరింతగా పెరగొచ్చు.

మూసీ తీరంలో నివసించే వేల ఇండ్లను కూల్చడం ద్వారా నగరంలో భయోత్పాతాన్ని సృష్టించడమే పాలకుల కుట్ర. తద్వారా రియల్ ఎస్టేట్ రంగం కుదేలై పెట్టుబడిదారులు, కార్పొరేట్ కంపెనీలను అమరావతి వైపు తరలించాలన్నది వారి లక్ష్యం. ఈ కుట్ర ఇలా ఉంటే, సినీ పరిశ్రమను సైతం తరలించడానికి భారీ కుట్ర జరుగుతున్నది. ప్రముఖ హీరో నాగార్జునపై మంత్రి కొండా సురేఖ చేసిన దిగజారుడు వ్యాఖ్యలే అందుకు నిదర్శనం. మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా సినీ పరిశ్రమను లక్ష్యంగా చేసుకొని మాట్లాడుతున్నారు. అదే సమయంలో ఏపీకి పరిశ్రమ తరలిరావాలని, అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు ఇస్తామని అక్కడి పాలకులు పిలుపునిస్తుండటంతో సినీ పరిశ్రమ సైతం ఆలోచనలో పడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక, సామాజిక దోపిడీని తెలంగాణ ప్రజలు, మేధావులు, విద్యావంతులు గ్రహించాలి. తెలంగాణపై కాంగ్రెస్ పాలకులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)

> **అసలు ఇప్పటివరకు మూసీ ప్రాజెక్టుకు సంబంధించి స్పష్టమైన డీపీఆర్ లేదు. ఒక్కో మంత్రి ఒక్కో విధంగా అంచనాలు లెక్క గడుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు రూ.50 వేల కోట్లని చెబితే.. ముఖ్యమంత్రి ఏకంగా రూ.1.50 లక్షల కోట్ల అంచనా వ్యయం అవుతుందని చెప్తుండటం కాంగ్రెస్ పాలకుల తీరుకు నిదర్శనం.**

పాత పాటే పాడుతున్న రాహుల్!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తాను చిన్న పిల్లాడి మనస్తత్వం ఉన్న 'పప్పూ'ను కాదని నిరూపించడానికి రొడ్డకొట్టుడు ప్రకటనలకు బ్రాండ్ అంబాసిడర్ అవుతున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న ఏ రాజకీయ పార్టీ అయినా పాలకపక్షం పక్షపాత ధోరణులను నిరంతరం ఎండగట్టవచ్చు. కేంద్రంలో సంకీర్ణ సర్కార్‌ను నడుపుతున్న బీజేపీపై గత ఆరు నెలలుగా నేరుగా విమర్శలు ఆయన గుప్పించడం లేదు. దేశంలో సంపద విలువలో, తమ పరిశ్రమల ఆదాయం, లాభార్జనలో అగ్రస్థానాల్లో ఉన్న ముకేష్ అంబానీ, గౌతమ్ అదానీల పేర్లతోనే నరేంద్ర మోదీ సర్కార్‌ను ఎక్కువగా ఎండగట్టడం రాహుల్‌కు ఇష్టమైన వ్యాపకమని దినపత్రికలు చదివేవారికి అర్థమవుతున్నది. వారంలో కనీసం మూడుసార్లు అదానీ, అంబానీల ప్రస్తావన లేకుండా కాంగ్రెస్ పార్టీ సమావేశాల్లో, ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ ప్రసంగం సాగడం లేదు.

నాంచారయ్య మెరుగుమాల

2014 నుంచి కాంగ్రెస్ ప్రతిపక్ష హోదా లేకుండా బతికింది. 2024 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకోవడంతో రాహుల్‌కు లోక్‌సభలో ప్రతిపక్ష నేత అనే కొత్తహోదా వచ్చింది. అప్పటినుంచీ ఈ 'యువనేత'లో ఎనలేని తొందర ఎక్కువైంది. దేశాన్ని ఐదు దశాబ్దాలకు పైగా పరిపాలించిన ప్రభుత్వాలకు కాంగ్రెస్ నాయకత్వం వహించిందనే విషయం తెలియకుండా రాహుల్ మాట్లాడుతున్నారా? అనే అనుమానం వస్తున్నది. పదే పదే అంబానీ, అదానీల పేర్లు ప్రస్తావిస్తూ ప్రధాని మోదీని దుయ్యబట్టే ధోరణి చూస్తుంటే పాత తరం ప్రజలకు దేశంలో 1960లు, 70లు, 80ల చివరివరకూ సాగిన రోజులు గుర్తుకొస్తున్నాయి. దేశంలో మొదటిస్థానంలో ఉన్న పారిశ్రామిక కుటుంబంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ స్థాపకుడు ధీరూభాయ్ అంబానీ పరివారం అవతరించకముందు దాదాపు 50 ఏండ్ల కిందట రెండు కమ్యూనిస్ట్ పార్టీలు, ఇతర ప్రతిపక్షాల నాయకులు 'టాటాలు బిర్లాలు' మాత్రమే దేశంలో ఆర్థికంగా బలపడుతున్నారని, సామాన్య ప్రజానీకం స్థితిగతులు మెరుగుపడడం లేదని తరచు నాటి పాలకపార్టీ కాంగ్రెస్‌పై విరుచుకుపడేవారు. కొన్ని దశాబ్దాలపాటు వ్యాపార లావాదేవీలు, లాభార్జనలో ముందుండి సంపద విలువలో మొదటి పది స్థానాల్లో ఉన్న పారిశ్రామిక గ్రూపుల ఆదాయ వివరాలు అప్పట్లో పత్రికల్లో ప్రచురించినప్పుడు గోద్రెజ్‌లు, సింఘానియాలు, గోయెంకాలు, దాల్మియాలు, కిర్లోస్కర్లు, మోదీలు తదితర కుటుంబాల నియంత్రణలోని పారిశ్రామిక గ్రూపుల పైన మొదటి రెండు ర్యాంకుల్లో టాటాలు, బిర్లాలు ఉండేవారు. అప్పట్లో గుత్తాధిపత్యాన్ని నిరోధించే ఎంఆర్‌టీపీ చట్టం అమలులో ఉండేది. అయినా, టాటాలు, బిర్లాలు సంపదలో, వ్యాపార పరిమాణంలో ఎవరికీ అందనంత దూరంలో ఉన్నత స్థానాల్లో ఉండేవారు. వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాలు పదే పదే తమ పేర్లు ప్రస్తావించినా ఈ రెండు గ్రూపులూ స్పందించేవి కావు. పాలకపక్షమైన కాంగ్రెస్ పార్టీ మాత్రం కేంద్రంలో, రాష్ట్రాల్లో తిరుగులేని ఆధిపత్యంతో పరిపాలన కొనసాగిస్తూ ఏకైక అతిపెద్ద పాలక జాతీయపార్టీగా వ్యాపారసంస్థల నుంచి విరాళాలు మొదలుకొని అన్నివిధాలా లబ్ధి పొందేది.

మాజీ ప్రధాని నెహ్రూ నాటి పరిస్థితులను తన దృక్పథంతో అంచనా వేసి ప్రవేశపెట్టిన 'లైసెన్స్ కోటా రాజ్' విధానాలు నిజంగానే కొన్ని పారిశ్రామిక గ్రూపులకే అవకాశాలు కల్పించేవి. ఎంఆర్‌టీపీ చట్టం దేశంలో గుత్తాధిపత్యాన్ని ఆశించిన రీతిలో కట్టడి చేయలేకపోయింది. అందుకే ఐదారు దశాబ్దాల కిందట కొన్ని పారిశ్రామిక గ్రూపులే అగ్రస్థానాల్లో కొనసాగాయి. 1991 నుంచీ ప్రధాని పీవీ, ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్ ద్వయం ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలో కొత్త కొత్త రంగాల్లో కొత్త పారిశ్రామికవేత్తల ఆవిర్భావానికి, అలాగే ఐటీరంగంలో ఇన్ఫోసిస్ ఎన్.ఆర్.నారాయణ మూర్తి, విప్రో అజీమ్ ప్రేంజీ వంటి నూతన ఆంత్రప్రెన్యూర్లు అవతరించడానికి దోహదం చేశాయి.

> **టాటాలు, బిర్లాలు మాత్రమే అగ్రస్థానాల్లో కొనసాగడానికి కాంగ్రెస్ సర్కార్లు ఎంతవరకు కారణమో చెప్పడం కష్టం. అయితే, 1980లు, 90ల ఆరంభంలో అంబానీలకు కాంగ్రెస్ ప్రభుత్వాల అండదండలున్నాయని, 1990ల చివరినుంచి 2004 వరకూ కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని రెండు ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వాలు సానుకూలంగా వ్యవహరించాయనే మాటలు వినిపించేవి. వాటిలో నిజం లేదని ఆ తర్వాత ఈ గ్రూపు కంపెనీలు, పరిణామాలు నిరూపించాయి.**

భారీ మొత్తాల్లో పెట్టుబడులు పెట్టగలిగే అనుభవం ఉన్న వ్యాపార గ్రూపులకు కొన్ని రంగాలు ఈ 'గ్లోబలైజ్డ్ వెల్ కనెక్టెడ్' ప్రపంచంలో ఎనలేని లాభావకాశాలు ఇస్తాయని మన అనుభవాలు చెప్తున్నాయి. 2024 ఆరంభం నుంచే 'అదానీ, అంబానీ' వ్యాఖ్యలతో బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శల జోరు పెంచారు. తోటి గుజరాతీలైన ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీలకు మోదీ సర్కార్ అడ్డగోలుగా ప్రయోజనాలు కల్పిస్తున్నదని కాంగ్రెస్ నేత విరుచుకుపడేవారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య ఈ 'అంబానీ, అదానీ' ఆట ఎందాకా వెళ్లిందంటే కిందటి మే మొదటివారం పార్లమెంటు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఒక సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. 'ఈ మధ్య అదానీ, అంబానీలపై రాహుల్ మౌనం పాటిస్తున్నారెందుకో మరి? సాధారణ ఎన్నికల షెడ్యూలు వచ్చినప్పటి నుంచీ ఆయన ఈ ఇద్దరి సంగతి ఎత్తడం లేదు. ఆటోల్లో కరెన్సీ కట్టలేమైనా అందుకున్నారా, కాంగ్రెస్ నేత?' అంటూ వ్యంగ్య బాణాలు సంధించారు.

రాజస్థాన్‌లో అశోక్ గెహ్లోట్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముఖ్యమంత్రి సమక్షంలోనే అదానీ గ్రూపు అంగీకారం తెలిపింది. అప్పటికే అదానీ గ్రూపుపై రాహుల్ ఆరోపణలు గుప్పిస్తున్నారు. న్యాయబద్ధమైన పోటీ మూలసూత్రంగా నడిచే పెట్టుబడిదారీ వ్యవస్థలో పాలకుల అడ్డగోలు అండదండలతో కొన్ని కంపెనీలు విశేష లబ్ధి పొందితే అలాంటి విషయాలను ఎండగట్టి, దిద్దుబాటు చర్యలకు దోహదం చేయడం ప్రతిపక్షాల బాధ్యత. 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' అంటే అమెరికాలోనైనా ఐరోపా దేశాల్లోనైనా ప్రజాస్వామిక వాదులు, పౌరులు వ్యతిరేకించే విధానమే. అలాంటప్పుడు రెండు పారిశ్రామిక కుటుంబాల నిర్వహణలోని రెండు గ్రూపులు ఎలా ప్రభుత్వ తోడ్పాటుతో ఎక్కువ లాభాలు సంపాదించాయో సాక్ష్యాధారాలు చూపించకుండా రాహుల్‌గాంధీ ఇటీవల ఒక ఊళ్లో, చూడండి అదానీ బ్యాంకు ఖాతాల్లోకి నగదు సునామీలా వచ్చిపడుతున్నది. పేదలు, బడుగువర్గాల అకౌంట్ల నుంచి తుఫాన్ మాదిరిగా సొమ్ము ఎగిరిపోతోందని క్లుప్తంగా చెప్పడం వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరదు.

> **ఇలాంటి రాహుల్ గంభీర ప్రకటనల ద్వారా 1950లు, 60ల్లో పేదల పాలిట పెన్నిధులుగా ప్రజలు కొన్ని ప్రాంతాల్లోనైనా నమ్మిన కమ్యూనిస్టు నేతల తరహాలో మాట్లాడితే రాహుల్‌కు వచ్చే రాజకీయ ప్రయోజనం శూన్యమే. దశాబ్దం తర్వాత లోక్‌సభలో పదో వంతు సీట్లు సంపాదించి (543 సీట్లకు కనీసం 55 సీట్లు) కాంగ్రెస్ గుర్తింపు పొందిన ప్రతిపక్షంగా అవతరించి, రాహుల్‌కు ఆ పార్టీ నేతగా ఎల్ఓపీ హోదా వచ్చిన తర్వాత కూడా తాను 'పప్పూ' స్థాయి నుంచి ఎదగలేదని పదే పదే నిరూపించుకుంటున్నారు.**

డా.లోహియా అంబేద్కర్ విచారధారతో నడిచే హిందీ రాష్ట్రాలకు చెందిన 'జనతా పరివార్' పార్టీల అరిగిపోయిన అజెండా అయిన 'కులగణన'ను, మొత్తం కోటాలన్నీ కలిపి 50 శాతం దాటిపోయినా చట్టపరమైన ఇబ్బంది లేకుండా చూడాలనే తమిళనాడుకు చెందిన ద్రావిడ పార్టీల వాదనను తన సొంత ఐడియాలుగా చెప్పుకొంటున్న కాంగ్రెస్ నాయకుడి బాటనే ఈ పార్టీ ప్రాంతీయ నేతలు కూడా నడుస్తున్నారు. కులగణనపై కాంగ్రెస్‌కు పేటెంట్ హక్కు ఉన్నదని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఇటీవల చెప్పడం ఈ జాతీయపక్షం దివాలాకోరుతనానికి పరాకాష్ఠ.

> **టాటా బిర్లాలు అనే నినాదం ఒక్కటే దేశంలో కాంగ్రెసేతర జాతీయ, ప్రాంతీయ పక్షాలకు కొన్ని దశాబ్దాలకు అధికారం సాధించిపెట్టలేదు. అలాగే, అదానీ అంబానీలు అనే అరిగిపోతున్న రాహుల్ మాటలు కాంగ్రెస్‌కు 'బ్రహ్మాస్త్రం' కాలేవని ప్రతి భారత పౌరుడు చెప్తాడు.**

ఏ శక్తి వైకల్య ఘడియన శని నెత్తి మీద కూసుందో..! పాడి బర్రెను జారవిడిచి ఎగిరి తన్నే దున్నను తెచ్చుకున్నాం. అదిప్పుడు ఎగిరెగిరి తంతుంటే ఒళ్లంతా గాయాలైతున్నయి. గాయపడ్డ బిడ్డ 'అమ్మా' అనటం ఎంత ప్రాకృతికమో..! నిలువెల్లా గాయపడ్డ తనువులు అంతే ప్రాకృతికంగా 'బాపూ' అని పలవరిస్తూ గుండెలు బాదుకుంటున్నయి.

కొట్లాడటం మనకు కొత్తనా?

వర్ధెల్లి వెంకటేశ్వర్లు

వెనుకటికి ఎండకాలంతో పాటే ఊళ్లకు దొంగల భయం చొరబడేది. ఆ ఊళ్లె దొంగలు పడ్డరు.. ఈ ఊళ్లె దొంగలు పడ్డరు. దోస్కపోయిండ్రు అని వదంతులు పుట్టేయి. అవి వదంతులు కావు, నిజం కూడా ఉండేది. తమను తాము కాపాడుకునేందుకు ఊరు, ఊరంతా నిద్రాగారం లేకుండా జాగారం చేసేది. ఇంటికి పంటకు కాకుండా జనం తీవ్ర ఒత్తిడితో ఉండేవాళ్లు. అలిసి విసిగి వేసారిపోయేవాళ్లు. 'ఆరు పథకాలు ఇస్తా.. ఆనాటి రోజులు మళ్లీ తెస్తా' అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పాతర పెట్టి ఆనాటి రోజులను టంఛన్‌గా మళ్లీ తెచ్చింది. ఇవ్వాళ్ల తెలంగాణ పట్టణాలు పల్లెలు మళ్లీ జాగారం చేస్తున్నాయి. దొంగరాత్రి వేళ బుల్డోజర్లు వస్తున్నయి. లంకిని పడ్డట్టు ఇళ్ల మీద పడుతున్నయి. కంటి మీది రెప్ప వాలినంతలో గూళ్లను చిదిమేస్తున్నయి. పాలకులు పంపిన రాక్షస బుల్డోజర్లు ఎప్పుడు ఎవరి ఇంటిమీద పడుతయో తెల్వక జనం హడలిపోతున్నరు. వీటికి వదంతులు తోడైనయి. 'అగో వచ్చే.. ఇగో వచ్చే' నంటూ అధికారులే లీకులు వదులుతున్నరు. జనం కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నరు. నిద్రకాచి ఇంటి కావలి కాసుకుంటున్నరు.

> **'నా ఇల్లు కూలిపోతంది.. కేసీఆర్ అన్నా రాయే' అని దంపతులు గుండెలు బాదుకుంటా గోసటిల్లిన దృశ్యం మానవ గుండె తడిని తడిమింది. 'సర్ నిలబడ్డ చోటు నుంచి జారిపోతున్నం' అని ఓ తల్లి దీనత్వానికి హరిశ్‌రావే వలవల ఏడ్చిండు. ఒక్క మూసీ నది కాదు.. ముప్పేట సర్కారు బుల్డోజర్లు జనం మీద పడుతుంటే పేద, మధ్యతరగతి కుటుంబాలు కకావికలమైపోతున్నయి.**

ఇది ఊహించని ఆపదైతే కాదు. ఎన్నికలకు ముందే కేసీఆర్ పసిగట్టి చెప్పిండు. లోకం పోకడను గమనించే..! 'మనం చెదిరిపోయిననాడు మళ్లీ పాత తెలంగాణ వస్తది. బతుకులు ఆగమైతయి. మోసపోతే గోసపడుతం. చెప్పటం నా బాధ్యత. ఒక్కసారి దెబ్బతింటే..! ఉన్న కూర్పు చెడిపోతే తెలంగ